క్లుప్తంగా

గ్యార్మీ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: జడ్చర్ల లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్యార్మీ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

రాజాపూర్: ఇంటి నుంచి బయలుదేరి కాలేజీ వెళ్తానని చెప్పి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రవి వివరాల ప్రకారం.. రాజాపూర్ గ్రామానికి చెందిన పాలమూరు రామేశ్వరి, శ్రీశైలం దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్దకూతురు నవ్య(19) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. జనవరి 2న హైదరాబాద్‌లో కాలేజీకి వెళ్తున్నానని చెల్లెలికి చెప్పి వెళ్లిపోయింది. పని నుంచి ఇంటికి వచ్చిన తల్లి నవ్య ఎక్కడికి వెళ్లిందని చిన్నకూతురు అడగగా, కాలేజీకి వెళ్లిందని చెప్పింది. కాలేజీకి ఫోన్ చేసి అడుగగా, రాలేదని యాజమాన్యం చెప్పారు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు బాలానగర్, షాద్‌నగర్, హైదరాబాద్‌లలో, బంధువుల వద్ద ఆచూకీ కోసం వెతికారు. ఎక్కడా లేకపోవడంతో ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలి

కోయిల్‌కొండ: పది గ్రామాల ప్రజల మద్దతు ఉన్న గార్లపహాడ్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ మండల కో కన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గార్లపహాడ్ గేటు దగ్గర జేఏసీ నాయకులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీనువాసులు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

'సంవిధాన్ జిందాబాద్'కు తరలిన నాయకులు



స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లోని కులీ కుతుబ్‌షా మైదానంలో ఆదివారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన 'సంవిధాన్ జిందాబాద్' బహిరంగసభ కార్యక్రమానికి జిల్లా కేంద్రం నుంచి పార్టీ మైనార్టీ నాయకులు తరలివెళ్లారు. ప్రత్యేక వాహనాల్లో వందలాది మంది మైనార్టీ నాయకులు కార్యక్రమానికి వెళ్లారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్‌అలీ, మైనార్టీ విభాగం అసెంబ్లీ చైర్మన్ ఫక్రుద్దీన్ ఖురేషి, నాయకులు అక్బర్, ఫహీం, అశ్వాక్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం ఎంతో గొప్పది



రాజాపూర్(బాలానగర్): భూమిమీద ఉన్న ప్రతి మనిషికి తినడానికి పదిముద్దలు అందించేది అన్ని దానాల్లోకన్న ఎంతో గొప్పది అన్నదానమని గురుస్వామి పంబరాజు గురుస్వామి పేర్కొన్నారు. ఆదివారం బాలానగర్ మండలంలోని ఉడిత్యాలలో ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు లక్ష్మీనారాయణగౌడ్, మణిప్రసాద్, నర్సింగ్, రాము, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కిష్టారం మల్లేష్‌గౌడ్, మహేష్, శ్రీకాంత్, రాజు, నిరంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ముదిరెడ్డిపల్లిలో అయ్యప్పస్వామి పడిపూజ

రాజాపూర్: మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామ శివారులోని జాతీయరహదారి పక్కన ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం ఆవరణలో మణిగురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడిపూజ, ఇరుముడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గురుస్వాములు శేఖర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్, అయ్యప్పస్వాములు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయ్యప్పభక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు పేర్కొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: వరంగల్ జిల్లా పరకాలలో ఆదివారం జరిగిన నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించినట్లు ఫౌండర్, సీనియర్ కరాటే మాస్టర్ కె.వెంకటేశ్ తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఆయా విభాగాల్లో భవాని, చందువర్ధన్ మొదటి స్థానంలో, వరుణ్‌కుమార్‌గౌడ్ ద్వితీయ, చంద్రమోహన్, లతిక, అభికుమార్ మూడోస్థానంలో నిలిచి పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను కరాటే మాస్టర్ అభినందించారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- ఎంవీఎస్ జూనియర్ కళాశాల ఆవరణలో శ్రమదానం



భగీరథకాలనీ నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేపట్టడమే తమ అజెండా అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎంవీఎస్ జూనియర్ కళాశాల ఆవరణలో శ్రమదానం చేశారు. తరగతి గదుల పైభాగంలో దెబ్బతిన్న రేకులను తొలగించి కొత్తవి అమర్చాలని, మిగతా గదులకు స్లాబ్ వేయించాలని అధికారులకు సూచించారు. ఆవరణలో విద్యార్థులకు ఉపయోగపడేలా రెండు పార్కులు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం 22వ వార్డు పరిధిలోని భగీరథ కాలనీలో నిర్మిస్తున్న సెప్టిక్ ట్యాంక్ ఔట్‌లెట్, డ్రెయినేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చే కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని, మరికొన్నింటిని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తున్నామన్నారు. అధికారులు ఎవరైనా తప్పు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, కాంగ్రెస్ నాయ కులు సాయిబాబ, ప్రశాంత్, అజ్మత్‌అలీ, ప్రవీణ్‌కుమార్, ఇమ్రాన్, కృష్ణకాంత్‌రెడ్డి, చిన్న, అంజద్, నాగరాజు, అబ్దుల్‌హక్, వెంకటేష్, హన్మంతు పాల్గొన్నారు.

సోదర భావంతో ఉత్సవాలు

సోదరభావంతో ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని అబ్దుల్‌ఖాదర్ దర్గాను సందర్శించి చాదర్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

టీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

తమ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా శాఖ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

గ్రామీణ వైద్యుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

పాలమూరు: జిల్లా గ్రామీణ వైద్య సేవకుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం పట్టణంలోని న్యూవిజన్ గార్డెన్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం రక్తదాన శిబిరంలో దాతలు రక్తదానం చేశారు.

విద్యానిధికి విరాళాల వెల్లువ

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముందుచూపుతో ఏర్పాటు చేసిన 'మహబూబ్‌నగర్ విద్యానిధి'కి పలువురు విరాళాలు అందజేస్తున్నారు. స్థానిక శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ సుందరీకరణ కమిటీ అధ్యక్షులు పోల శ్రీనివాస్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యానిధికి రూ.50వేల చెక్కును ఎమ్మెల్యే యెన్నంకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే అభినందించారు. టీడీగుట్టకు చెందిన కాంగ్రెస్ నాయకుడు దోమ పరమేశ్వర్ విద్యానిధికి రూ. 11,111ల చెక్కును ఎమ్మె ల్యేకు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణయ్య, మల్లేష్, తిరుపతయ్య, భాస్కర్, రాఘవేందర్, మల్లికార్జున్ ఉన్నారు.

టీజీఓ అధ్యక్షుడికి ఘన సన్మానం



టీజీఓ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ మహాసభ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇటీవల తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన విజయ్‌కుమార్ ముదిరాజ్‌కు ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాసులు మాట్లాడుతూ ముదిరాజ్‌లు భవిష్యత్‌లో మరిన్ని పదవులను అధిరోహించాలన్నారు. ఒక ముదిరాజ్ బిడ్డ ప్రతిష్టాత్మమైన పదవికి ఎంపిక కావడం చాలా గర్వంగా ఉందన్నారు. బాధ్యతతో పని చేస్తూ ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం పలువురు విజయ్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నారాయణపేట్ అధ్యక్షుడు వేణుగోపాల్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, శ్యాంసుందర్, మాధవి, రంజిత, బాలరాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు పురస్కారాలు ప్రదానం

మహబూబ్‌నగర్ రూరల్: మున్నూరుకాపు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మున్నూరుకాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు సంఘం అధ్యక్షుడు దుంకుడు శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో విద్యార్థుల ప్రతిభా పురస్కారాలు, నూతన ఉద్యోగాలు సాధించిన వారికి అభినందనలు, అవార్డు పొందిన ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం, 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ అంశాలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఐఐటీ, జేఈఈ, మెడిసిన్ రంగాలలో సీట్లు సాధించిన విద్యార్థులకు ఈనెల 12న స్థానిక ఫంక్షన్‌హాల్లో ప్రతిభా పురస్కారాలు అందజేసి సత్కరించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బుక్కస్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి గోపాల్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శులు కోరమోని వెంకటయ్య, కృష్ణయ్య, యాదగిరి, మురళీకృష్ణ, నర్సిరెడ్డి, రమేష్, బాలరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దుంకుడు శ్రీనివాస్

సంస్కృతిని చాటిచెప్పేవే ముగ్గులు



వెంకటేశ్వర కాలనీ దేవాలయంలో ముగ్గులు వేస్తున్న మహిళలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పేవి ముగ్గులు అని 1వ వార్డు కౌన్సిలర్ రోజా అన్నారు. ఆదివారం శ్రీకారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర కాలనీలో ముగ్గుల పోటీ నిర్వహించారు. ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీకారం ఫౌండేషన్ అధ్యక్షుడు శశిబాబు, ఆస్ట్రాల్ లిమిటెడ్ మేనేజర్ సంతోష్‌కుమార్, సభ్యులు ప్రసన్నకుమార్, ఉపేందర్, శివ, రాఘవరెడ్డి, భూషన్‌పాండే, శంకరయ్య, రవీందర్, చంద్రశేఖర్, సులోచన, వాణి, జ్యోతి ఈశ్వరమ్మ, సుజాత పాల్గొన్నారు.

శ్రీకరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

మకర సంక్రాంతి సందర్భంగా శ్రీకరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీచర్స్ కాలనీలో సీతారామదేవాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. శ్రీకరి ఫౌండేషన్ పాలమూర్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టుకాడి శ్యాంసుందర్ మాట్లాడారు. మొదటి బహుమతి భాగ్యశ్రీ, రెండవ బహుమతి శ్వేత, పావని మూడో బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, దేవేందర్, రామ్, కృష్ణవేణి, దివ్య రంజిత, పద్మ పాల్గొన్నారు.

వీధికుక్కలకు కు.ని. ఆపరేషన్లు

- జిల్లాకేంద్రంలో నెల వ్యవధిలోనే 250 పట్టివేత
- ఎప్పటికప్పుడు సంరక్షణ కేంద్రానికి తరలింపు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో వీధికుక్కల బెడదను నివారించేందుకు మున్సిపల్ అధికారులు పలు చర్యలు తీసుకుంటున్నారు. గత నెల 5న రాత్రి పట్టణంలోని 11, 12, 25, 26 వార్డుల్లో ఓ వీధికుక్క స్వైరవిహారం చేసి ఏకంగా 31 మందిపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటన జరిగి సరిగ్గా నెల రోజులు అవుతుండగా ఇప్పటి వరకు సుమారు 250 వీధికుక్కలను ప్రత్యేక బృందం పట్టుకుంది. వీటిని మౌలాలిగుట్టలోని సంరక్షణ కేంద్రానికి తరలించి ప్రతి వారం కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స నిర్వహిస్తున్నారు. తాజాగా ఆదివారం 52, గత వారం 60 కుక్కలకు కు.ని. శస్త్రచికిత్స చేశారు.



ఏబీసీలో కుక్కకు శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

బాలమణికి సావిత్రిబాయి పూలే అవార్డు



జడ్చర్ల టౌన్: సామాజిక సేవ అందిస్తున్న జడ్చర్లకు చెందిన బాలమణిని హోప్ స్వచ్ఛంద సేవా సమితి, సింధుఆర్ట్స్ అకాడమి వారి సావిత్రిబాయి పూలె ఎక్సలెన్స్ జాతీయ అవార్డుతో సత్కరించింది. శనివారం రాత్రి హైదరాబాద్ త్యాగరాయగాన సభలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు షీల్డు, ప్రశంసాపత్రంతో సత్కరించారు. బాలమణికి సామాజిక సేవలో సావిత్రిబాయి పూలె ఎక్సలెన్స్ జాతీయ అవార్డు రావటం పట్ల ఆయా సేవా సంఘాలు అభినందనలు తెలిపాయి.

యువత క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలి



కోయిల్‌కొండ: గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని మాజీ జెడ్పీటీసీలు విజయ్‌భాస్కర్‌రెడ్డి, బాల్‌సింగ్‌లు అన్నారు. ఆదివారం మండలంలోని గంగ్యానాయక్‌తండాలో యువత ఏర్పాటు చేసిన జై సేవాలాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు.కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య, మల్లయ్య, భీంరెడ్డి, నారాయణ, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మిర్చి ధరలు పెంచాలి

మరికల్: ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చికి ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని మిర్చి రైతు సంఘం నాయకులు శ్రీను, రాములు, వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ మిర్చికి కనీస మద్దతు ధర రూ. 20 వేలు ఉండాలన్నారు. క్వింటాల్‌కు రూ.10 వేల లోపు ధర నిర్ణయించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని గుర్తు చేశారు. ఎకరాకు రూ.70 వేల పెట్టుబడి పెట్టి మిరప పంటను సాగు చేస్తే తీరా ధరలు లేక పెట్టుబడి కూడా రాని పరిస్థితి వచ్చిందని వాపోయారు. ప్రభుత్వమే మిర్చికి మద్దతు ధర ప్రకటించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

స్నేహితురాలి కుమార్తె పెళ్లికి ఆర్థిక సాయం



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ స్నేహితురాలి కుమార్తె వివాహానికి ఆర్థిక సాయం అందజేశారు. కొమిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జరీనా బేగం మూసాపేటలో చదువుకోగా ఆమె కుమార్తె పెళ్లికి పూర్వ విద్యార్థులు రూ.40వేలు పోగు చేశారు. సోమవారం వివాహం కావడంతో ఆదివారం జడ్చర్లలో ఉండే జరీనాబేగం ఇంటికి వెళ్లి నగదును అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తబస్సుమ్ సుల్తానా, దంతేశ్వర్, రవీందర్‌గౌడ్, టైలర్ ముజాహిద్, మహ్మద్ పాష, వెంకటయ్య, రాజు, చంద్రమౌళి, యాదయ్య, నాగయ్య, చంటిబాబు, గట్టు ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

బాధితుల కోసం రక్తదానం



జడ్చర్ల టౌన్: తలసేమియా బాధితుల కోసం మున్సిపాలిటీ పరిధిలోని హౌజింగ్‌బోర్డు కాలనీ మహిళలు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. రెడ్‌క్రాస్, లయన్స్‌క్లబ్‌ల సహకారంతో వారు నిర్వహించిన శిబిరంలో 40మంది రక్తదానం చేశారు. వారిలో 8మంది మహిళలు ఉండటం విశేషం. తలసేమియా బాధితుల సహాయార్థం తమవంతుగా రక్తదాన శిబిరం నిర్వహించామని హౌజింగ్ బోర్డు కాలనీ మహిళలు తెలిపారు. సహకరించిన లయన్స్‌క్లబ్, రెడ్‌క్రాస్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: జడ్చర్ల నియోజకవర్గంలో విద్యారంగం అభివృద్ధికి మరింతగా కృషి చేస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. నియోజకవర్గంలో వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థులకు బ్యాగులు, వాటర్ బాటిల్స్ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, మార్కెట్ చైర్ పర్సన్ జ్యోతి, పీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు రూ.12 వేలు ఇవ్వాలి



ఆటో యూనియన్ నూతన కార్యవర్గ సభ్యులు

మహబూబ్‌నగర్ రూరల్: ఆటో కార్మికులకు ప్రభుత్వ సహాయం రూ.12 వేలు తక్షణమే ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మన్యంకొండ దేవస్థానం వద్ద ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సులు ఏర్పాటు చేయడంతో ఆటో కార్మికులు ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఆటో కార్మికుల వేదనను ప్రభుత్వం గమనించి రూ.12వేల ఆర్థిక సహాయం తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మన్యంకొండ ఆటోస్టాండ్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా చిన్న వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శిగా బాలయ్యగౌడ్, ఉపాధ్యక్షులుగా కె.సాయిలు, రామకృష్ణ, హీర్యానాయక్, సహాయ కార్యదర్శులుగా రవినాయక్, కోస్గి శ్రీను, దాస్‌రాంనాయక్, కోశాధికారిగా బి.వెంకట్రాములు, ప్రచార కార్యదర్శిగా ఎం.బాలకృష్ణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, లక్ష్మణ్, శ్రీను, పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు.

మేధావుల సంఘీభావ సభ కరపత్రాలు విడుదల



మేధావుల సంఘీభావ సభ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంఈఎఫ్ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు కోసం ఈనెల 11న హైదరాబాద్‌లో జరిగే మేధావుల సంఘీభావ సభ కరపత్రాలను ఆదివారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్లో ఎంఈఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాదిగ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ సువార్తమ్మ మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ఫిబ్రవరి 7న తలపెట్టిన లక్ష డప్పులు వెయ్యి గొంతులు కార్యక్రమం విజయవంతం కోసం ప్రొఫెసర్ కాశీం అధ్యక్షతన ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో సంఘీభావ సభ ఉంటుందని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మాదిగ, ఉప కులాల ఉద్యోగులు, మేధావి వర్గం సామాజిక బాధ్యతగా స్వీకరించి ఎమ్మార్పీఎస్ చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. యాదయ్య, ఆకేపోగు రాములు, వెంకటేష్ మాస్టర్, ప్రభాకర్, కొండన్న, రాములు, కావలి కృష్ణయ్య, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాల కో ఆర్డినేషన్ కమిటీ



సమావేశమైన కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి బాలుర జిల్లా పరిషత్‌హైస్కూల్ శతాబ్ది ఉత్సవాల నిర్వహణ కోసం ఆదివారం జరిగిన సమావేశంలో కో ఆర్డినేషన్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీలో పూర్వ విద్యార్థులు బి.రవిశంకర్, కాల్వ రాంరెడ్డి, రమణాచార్యులు, సయ్యద్‌ఇబ్రహీం, వి.కృష్ణ, కంచుకోట ఆనంద్, వెంకటేశ్, దత్తు, శ్రీహరి, మేడిశెట్టి రామకృష్ణ, అర్జున్, గోనెల రాధాకృష్ణ, పెద్ది వెంకటేశ్, పరమటయ్య, మౌనిక, సంతోష్‌చారిలతో పాటు ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, ఎంఈఓ మంజులాదేవి, వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్‌లు ఉన్నారు. సమావేశం సందర్భంగా కమిటీ సభ్యులు వి.కృష్ణ, రమణాచార్యులు మాట్లాడుతూ ఈనెల 11 రెండో శనివారం పూర్వ విద్యార్థుల సమావేశం ఉంటుందని, సమావేశానికి పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. శతాబ్ది ఉత్సవాల నిర్వహణకోసం అవసరమైన ఆడిటోరియం నిర్మాణ కమిటీ, సావనీర్, వివరాల సేకరణ, స్పోర్ట్స్, ఫైనాన్షియల్ కమిటీలను ఎన్నుకుంటామని తెలిపారు. ఆసక్తి కలిగిన పూర్వ విద్యార్థులు ఆయా కమిటీల్లో బాధ్యతలు స్వీకరించాలని కోరారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి ఉత్సవాలను జయప్రదం చేసుకోవాల్సిన అవసరం ఉందని, మేధావులు, రిటైర్డ్ ఉద్యోగులు, సామాజిక వేత్తలు, రాజకీయ నాయకులు, వ్యాపారులు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

మహిళలపై అరాచకాలు అరికట్టాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: సమాజంలో రోజురోజుకు మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, మహిళలపై జరుగుతున్న అరాచకాలను ప్రభుత్వం ఆపేందుకు చర్యలు చేపట్టాలని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అబ్బాస్ డిమాండ్ చేశారు. ఐద్వా, టీపీఎస్‌కే, కేవీపీఎస్‌ల ఆధ్వర్యంలో మహాత్మా సావిత్రీబాయి పూలే జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సమాజంలో మహిళను చిన్న చూపుగా చూపే చిత్రాలను నిషేధించాలని, మహిళ గౌరవాన్ని పెంచడం ద్వారా సమాజ గౌరవం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీపీఎస్‌కే జిల్లా కార్యదర్శి కురుమూర్తి, ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మీసాల కురుమయ్య, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.వెంకటేష్, రజాక్, బాలచంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

ఐదోనెలలో అడుగుపెట్టిన ఉచిత భోజనం

నవాబుపేట: మండల కేంద్రంలో ప్రతి ఆదివారం జరిగే సంతకు వచ్చే జనాల సౌకర్యం కోసం అందిస్తున్న ఉచిత భోజన కార్యక్రమం నేటి ఆదివారంతో 5వ నెలలోకి అడుగుపెట్టింది. మండల కేంద్రానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి నాలుగు నెలలుగా నిరంతరంగా కొనసాగిస్తున్న ఉచిత భోజన కార్యక్రమం తాజాగా కొత్త ఏడాది జనవరితో 5వ నెలకు చేరింది. నేటికి ఉచిత భోజనం చేసిన వారి సంఖ్య దాదాపుగా 9 వేలకు చేరటం ప్రత్యేకం. మారుమూల గ్రామాలకు ఎలాంటి ప్రయాణ సౌకర్యం లేకపోవటంతో నవాబుపేటకు సంతకు వచ్చేవారు ఆదివారం ఉదయమే సంతకు రావటంతో వారికి సౌకర్యంగా ఉచిత భోజన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో వ్యాపార సంఘం మండల అధ్యక్షుడు సుధాకర్‌చారి, పుట్టి ఆంజనేయులు, అలీ, ఆశన్న, రాజు, నాగలింగం, రఘు, చందు, వెంకటయ్య పాల్గొన్నారు.



నవాబుపేట సంతలో భోజనం చేస్తున్న ప్రజలు

'మట్టి'తో రహదారిపై ఇబ్బందులు

అడ్డాకుల: 44వ నంబర్ జాతీయ రహదారిపై మట్టితో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దాబా హోటళ్లు, గ్రామాల స్టేజీలకు సమీపంలో హైవేపై రెండు చివర ఉండే వరుసలో రోడ్లపైకి వాహనాలు వచ్చేటప్పుడు మట్టి వచ్చి చేరుతోంది. ద్విచక్ర వాహనాలు వెళ్లే వరుసలో ఎక్కువ భాగం మట్టి వచ్చి చేరడంతో ఇబ్బందులు తప్పేలా లేవు. కాటవరం తండా స్టేజీ ఎదురుగా, కాటన్ మిల్లు సమీపంలో, శాఖాపూర్, గుడిబండ స్టేజీ వద్ద ఇటు హైదరాబాద్, అటు బెంగళూర్ వెళ్లే రోడ్డుపై బురద ఏర్పడుతోంది. ముఖ్యంగా రాత్రివేళ రోడ్డుపై మట్టి మూలంగా చివరి వరుస గుర్తు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే రహదారిపై మట్టి ఉన్న చోట ఆటోలు, ద్విచక్రవాహనాలు అదుపు తప్పి కింద పడుతున్నాయి. ద్విచక్రవాహనాలు వెళ్లే వరుసలో ఎక్కువ భాగం మట్టి ఉండటం వల్ల దానిలో వెళ్లే బైకులు అదుపు తప్పుతున్నాయి. వెనుక నుంచి రెండు వరుసల్లో భారీ వాహనాలు వస్తే ద్విచక్రవాహనదారులు తమ వాహనాలకు పూర్తిగా నిలుపుకుని తర్వాత వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రహదారి నిర్వాహకులు స్పందించి రోడ్డుపై మట్టి ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.



శాఖాపూర్ వద్ద రహదారి చివర ఏర్పడిన మట్టి